ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
బుధవారం, 30 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 42 | పేజీలు: 4 వెల: 5

# తుమ్మిడిహెట్టికి అనుమతులివ్వండి!

- మహారాష్ట్రతో ఒప్పందానికి కేంద్రం చొరవ చూపాలి
- ఎఫ్ఆర్ఎల్ +152 మీటర్లతో బ్యారేజీ నిర్మాణానికి అనుమతి
- పీఆర్ఎల్ఐఎస్, డీఎల్ఐఎస్, సీతారామకు పర్యావరణ అనుమతులు
- సమ్మక్కసాగర్ పెండింగ్ అనుమతులూ మంజూరు చేయాలి
- కృష్ణా జలాల లెక్కకు టెలిమెట్రీలు వేగవంతం చేయాలి
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ +152 మీటర్ల స్థాయిలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి ఇరు రాష్ట్రాల మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే ఎల్లంపల్లికి గ్రావిటీ ఆధారంగా నీటిని తరలించేందుకు వీలవుతుందని, తద్వారా నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, వ్యయం తగ్గుతుందని వివరించారు. ఢిల్లీలో మంగళవారం సాయంత్రం జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు, పెండింగ్ అనుమతులు, అంతర్రాష్ట్ర అంశాలపై చర్చించారు. తుమ్మిడిహెట్టి విషయంలో మహారాష్ట్రతో త్వరగా అంగీకారం కుదిరేలా కేంద్రం చొరవ తీసుకోవాలని సీఎం కోరారు.

**పర్యావరణ అనుమతులు త్వరగా ఇవ్వాలి**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు, గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పర్యావరణ అనుమతులకు మార్గదర్శకాలు జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో తెలంగాణ ప్రాజెక్టులకు వెంటనే

........(తరువాయి 2లో)

వరంగల్ సూపర్ స్పెషాలిటీకి ఇంకా బ్రేకులే

ఐదేళ్లుగా సాగుతున్న భారీ నిర్మాణం

భవనాలు సిద్ధమైనా వైద్య పరికరాల అమరికలో ఆలస్యం

నానాటికి గడువులు పెంచుతూ పోతున్న రాష్ట్ర ప్రభుత్వం

దసరాకు ప్రారంభించాలని యోచించినా అసాధ్యంగానే పరిస్థితులు

డిసెంబర్ నాటికైనా పూర్తి చేయాలన్న లక్ష్యంతో కొత్త నిర్దేశాలు

మరో వైపు భయపెడుతున్న పాత బడిన ఎంజీఎం ఆస్పత్రి నిర్మాణాలు

పై పెచ్చులు ఊడిపడుతుండటంతో గాయపడుతున్న రోగులు, సిబ్బంది





# ఆలస్యం తప్పదా?!

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తిస్థాయి సేవలకు ఇంకా సిద్ధం కాలేదు. ఐదేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణం ఒక దశకు చేరుకున్నా, ప్రజలకు వైద్యం అందించే అసలు ప్రక్రియ మాత్రం ఇంకా మిగిలే ఉంది. ప్రధాన భవనాలతోపాటు ఆపరేషన్ థియేటర్లు, ఓపీ, ఇన్‌పేషెంట్ విభాగాలు, ఆధునిక ల్యాబ్‌లు, అత్యాధునిక వైద్య పరికరాల అమరిక వంటి కీలక పనులు పూర్తికావాల్సి ఉంది. విదేశాల నుంచి తీసుకొచ్చే యంత్ర పరికరాల ఏర్పాటు, వాటి పనితీరు పరీక్షలు, విభాగాల అనుసంధానం పూర్తయిన తర్వాతే ఆస్పత్రి పూర్తిస్థాయి వైద్య కేంద్రంగా మారనుంది. ఇప్పటికే పలుమార్లు ప్రారంభ గడువులు మారిన నేపథ్యంలో తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనులపై ప్రత్యేక దృష్టిసారించారు. వచ్చే 30 రోజుల్లో 24 గంటలపాటు పనులు కొనసాగించాలని, ప్రతి పనికి ప్రత్యేక అధికారిని బాధ్యుడిగా నియమించాలని ఆదేశించారు. కలెక్టర్ ప్రతి రోజూ పనులను పర్యవేక్షించాలని స్పష్టం చేయడంతో ఇప్పుడు పనుల వేగంపై అధికార యంత్రాంగంపై బాధ్యత పెరిగింది. ఒకవైపు కొత్త సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎప్పుడు పూర్తవుతుందన్న ఎదురుచూపులు కొనసాగుతుండగా, మరోవైపు పాత ఎంజీఎం ఆస్పత్రి భవనాల పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. పాత నిర్మాణాల్లో పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో రోగులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

........(తరువాయి 2లో)

# సీఈసీ నిర్ణయాలపై సుప్రీం సందేహం!

- జ్ఞానేశ్‌కుమార్ చర్యలపై సుప్రీంకోర్టులో పిటిషన్
- వచ్చే వారం విచారణకు అంగీకరించిన ధర్మాసనం
- ఎస్ఐఆర్ నిర్ణయాలు ఏకపక్షమయ్యాయన్న పిటిషనర్
- 14 అభ్యంతరాలపై న్యాయస్థానం ముందుకు అంశం
- ఆర్టికల్ 324 అధికారాలపై స్పష్టత కోరిన పిటిషనర్
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలని కోరిన రాకేశ్‌కుమార్ సింగ్



**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం నిర్ణయాలు బహుళసభ్య సంస్థగా ఏకగ్రీవంగా లేదా మెజారిటీతోనే తీసుకోవాల్సి ఉండగా, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్న సందేహాలున్నాయని పిటిషనర్ రాకేశ్‌కుమార్ సింగ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీఈసీగా జ్ఞానేశ్‌కుమార్ వ్యవహరించే

........(తరువాయి 2లో)

## రాజ్యాంగంపై నమ్మకం లేకే దళితులపై వివక్ష

- ఖర్గేకు జరిగిన అవమానం దేశంలోని దళితుల ఆత్మగౌరవానికి అవమానం
- బీజేపీ పాలనలో ఎస్సీ, ఎస్టీలను రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారు
- ఆత్మగౌరవం కోసం దేశవ్యాప్తంగా ఐక్యంగా పోరాడాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపు

2





## అక్రమ హార్డ్‌వేర్ పార్క్ నోటిఫికేషన్‌పై పోరాటం

- వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా
- 23 ఏళ్లుగా నష్టపోతున్న భూ బాధితులు
- 3,000 ఎకరాలను 22–ఏ జాబితా నుంచి తొలగించాలి
- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

3

## రైటప్: ఉపఎన్నిక వస్తే.. కోడలికి టికెట్ ఇవ్వండి!

### బీజేపీ అధిష్ఠానానికి ఈటల అభ్యర్థన?

హుజూరాబాద్ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యమైతే తన కోడలు క్షమితారెడ్డికి బీజేపీ టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ అధిష్ఠానాన్ని మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కోరినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

- కాకతీయ, తెలంగాణ బ్యూరో

3



# పేదల కన్నీటికి విలువ కట్టలేం

### పేదవాడి సొంతింటి కలే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- నగరంలోనే పేదలకు గ్రౌండ్ ప్లస్ పది అంతస్తుల ఇళ్లు
- పారదర్శక డ్రాలో 480 మంది లబ్ధిదారుల ఎంపిక
- ఏడాదిలోపే నిర్మాణాలు పూర్తి చేసి తాళాలు
- ఇళ్ల రిజిస్ట్రేషన్ నేరుగా లబ్ధిదారుల పేర్లపైనే
- ఏడాదిలోపే ఇంటి తాళాలు అందిస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** పేదల కన్నీటికి విలువ కట్టలేమని, పేదవాడు తన జీవితకాలంలో ఒక్కసారైనా సొంతింటిని చూసుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏడాదిలోపే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందిస్తామని తెలిపారు. పేదల సొంతింటి కలను ఎన్నికల హామీగా కాకుండా ప్రభుత్వ బాధ్యతగా భావించి అమలు చేస్తున్నామని చెప్పారు. నగరంలో ప్రభుత్వానికి చెందిన వివిధ

........(తరువాయి 2లో)



> రాష్ట్రంలో ఖైరతాబాద్‌తో పాటు మరో నియోజకవర్గానికి ఉపఎన్నిక రాబోతోందా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసినట్లు చెబుతున్న వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు తెరతీశాయి. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఉపఎన్నిక జరిగే అవకాశం ఉందన్న సంకేతాలను సీఎం ఇచ్చినట్లు సన్నిహిత వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న బీఆర్ఎస్ నేత పాడి కౌశిక్‌రెడ్డిపై అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.

# హుజూరాబాద్‌లోనూ బైపోల్..?!

### మరో బైపోల్‌పై సీఎం రేవంత్ రెడ్డి హింట్?

- ఖైరతాబాద్‌తో పాటే ఉంటుందని సీఎం సంకేతాలు
- కౌశిక్‌రెడ్డిపై ఎథిక్స్ కమిటీ నిర్ణయమే కీలకం
- సెప్టెంబర్ 30న మరోసారి భేటీ
- వేటు పడితే హుజూరాబాద్‌లో ఉపఎన్నికే..!
- కడియం శ్రీహరి ఫిర్యాదుతో మొదలైన విచారణ
- తెలంగాణలో రెండో ఉపపోరుపై రాజకీయ చర్చ

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకుని ఎమ్మెల్యే పదవికి అనర్హత వస్తే హుజూరాబాద్‌కు ఉపఎన్నిక తప్పదన్న చర్చ మొదలైంది. అయితే ఎథిక్స్ కమిటీ తుది నిర్ణయం ఇంకా వెలువడలేదు. సెప్టెంబర్ 30న కమిటీ మరోసారి సమావేశం కానున్న నేపథ్యంలో ఉత్కంఠ నెలకొంది.

**ఖైరతాబాద్ బైపోల్ ఖాయం**

ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఇప్పటికే ఉపఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్ పార్టీ మార్పుపై తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 18న అనర్హత

........(తరువాయి 2లో)

## ఈవీఎంలు, ఓటర్ల జాబితాల్లో మ్యాచ్‌ఫిక్సింగ్!

- ఎన్నికల్లో రెండు రకాల మ్యాచ్‌ఫిక్సింగ్ జరుగుతోందన్న రాహుల్
- ఈవీఎంలు, ఓటర్ల జాబితాలపైనే ప్రధాన ఆరోపణలు
- ప్రజాస్వామ్య పరిరక్షణకు వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం
- ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్-ఈసీ మధ్య కొనసాగుతున్న వివాదం
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్
- ప్రజాస్వామ్యం కోసం పోరాడుతాం
- కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ

2

## నేడు సిరిసిల్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- కరీంనగర్ కలెక్టరేట్ భవన సముదాయం ప్రారంభం
- బహిరంగ సభలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి

3

# కాంగ్రెస్ నుంచి ఐదుగురి బహిష్కరణ

- లక్ష్మణ్ నాయక్‌పై దాడి ఘటనలో క్రమశిక్షణ చర్యలు
- హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల ఉత్తర్వులు


Mobile : +91 8978103333
wedsite: inchnk.com
email: hello@inchnk.com
dcchanumakonda@gmail.com

HANUMAKONDA DISTRICT CONGRESS COMMITTEE
N.R.R. BHAVAN, HANUMAKONDA, TELANGANA - 506 001

ENGALA VENKATRAM REDDY
President

ప్రెస్ నోట్
డిసిసి ఆఫీస్, హనుమకొండ - 29.09.2026

టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారి ఆదేశాల ప్రకారం వేలేర్ ఘటనపై కఠిన చర్యలు : పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన ఐదుగురు సభ్యులు తక్షణమే బహిష్కరణ.

వేలేర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మురావత్ లక్ష్మణ్ నాయక్‌పై ఇటీవల జరిగిన దాడి ఘటనకు సంబంధించి, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ లక్ష్మణ్ నాయక్ 25.09.2026 న ఒక అధికారిక లేఖ సమర్పించారు. ఈ ఘటనపై తక్షణమే స్పందించి, పూర్తి వివరాలతో కూడిన నివేదికను టీపీసీసీకి పంపించడం జరిగింది.

హనుమకొండ డీసీసీ నివేదిక ఆధారంగా టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన ఈ క్రింది ఐదుగురిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుని, పార్టీ నుండి పూర్తిగా బహిష్కరించారు:

1. మహమ్మద్ సద్దాం హుస్సేన్ (డీసీసీ కార్యవర్గ సభ్యులు)
2. బైరి అనిల్ (మాజీ వార్డు మెంబర్)
3. అందె కృపా సాగర్ (14వ వార్డు మెంబర్)
4. కుర్సపెల్లి హరీష్ (పార్టీ కార్యకర్త)
5. మహమ్మద్ సలీం మాలిక్ (మాజీ సోషల్ మీడియా మండల ఇన్‌ఛార్జ్)

ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ..

కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి పార్టీ నాయకత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. పార్టీలో క్రమశిక్షణే అత్యంత ప్రధానం. క్రమశిక్షణను ఉల్లంఘించి అరాచకాలకు పాల్పడితే ఎంతటి వారిపైనైనా సరే అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుంది అని హెచ్చరించారు..

ఇనగాల వెంకట్రామ్ రెడ్డి
అధ్యక్షులు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ

**కాకతీయ, హనుమకొండ** : వేలేర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నాయక్‌పై జరిగిన దాడి ఘటనలో పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన 5 మందిని కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించినట్లు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. లక్ష్మణ్ నాయక్‌పై జరిగిన దాడికి సంబంధించి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 25న తాను లేఖ సమర్పించగా, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలతో టీపీసీసీకి నివేదిక పంపినట్లు తెలిపారు. నివేదిక ఆధారంగా డీసీసీ కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సద్దాం హుస్సేన్, మాజీ వార్డు మెంబర్ బైరి అనిల్, 14వ వార్డు మెంబర్ అందె కృపాసాగర్, పార్టీ కార్యకర్త కుర్సపెల్లి హరీష్, మాజీ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్ మహమ్మద్ సలీం మాలిక్‌లను పార్టీ నుంచి పూర్తిగా బహిష్కరించినట్లు ఇనగాల వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే ప్రతి కార్యకర్త, నాయకుడికి పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు. పార్టీలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఉందని, క్రమశిక్షణను ఉల్లంఘించి అరాచకాలకు పాల్పడితే ఎంతటి వారిపైనైనా పార్టీ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

# ప్రమాదాల నివారణే లక్ష్యం

- వర్ధన్నపేట,రాయపర్తిలో రోడ్డు ప్రమాద స్థలాల పరిశీలన
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత



**కాకతీయ,రాయపర్తి/వర్ధన్నపేట :** రహదారులపై వరుస ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కల్పించడమే ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు.మంగళవారం వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై వర్ధన్నపేట,రాయపర్తి మండలాల పరిధిలో జరుగుతున్న ప్రమాద స్థలాలను (బ్లాక్ స్పాట్స్) రోడ్డు రవాణా,నేషనల్ హైవేస్ అథారిటీ (ఎన్ హెచ్ఎఐ) అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు.ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్న ప్రదేశాల్లో అవసరమైన చోట రోడ్డు వెడల్పు,కల్వర్టుల వద్ద రక్షణ గోడలు నిర్మించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాత్రి వేళల్లో సైతం మలుపులు స్పష్టంగా కనిపించేలా రేడియం సూచిక బోర్డులు,బ్లింకర్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. మితిమీరిన వేగం,రాంగ్ రూటు డ్రైవింగ్,మద్యం సేవించిన వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసులను ఆదేశించారు.కేవలం జరిమానాలు విధించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంపై దృష్టిసారించాలన్నారు.అనంతరం రాయపర్తి పోలీస్ స్టేషన్ ఆవరణంలో పోలీస్ అధికారులు,సిబ్బందితో కలిసి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.శాంతి భద్రతల పరిరక్షణ,కేసుల పురోగతిపై పలు సూచనలు చేసారు.ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య,సీఐ వై.సంజీవ రావు, ఎస్సైలు ముత్యం రాజేందర్,సాయి బాబ, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలలో ఐటీడీఏ పీఓ ఆకస్మిక తనిఖీ

**విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచన**



**కాకతీయ, వెంకటాపురం:** ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిని ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పో ఐఏఎస్ సూచించారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం రామంజాపూర్‌లోని ఏహెచ్ఎస్ బాలికల పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. వారి విద్యా ప్రగతి, బోధనా విధానం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థుల విద్యా రికార్డులను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నాణ్యమైన విద్యతోపాటు క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సమస్యలు, అవసరమైన సదుపాయాలపై సిబ్బందితో వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన విద్యా అవకాశాలు, సదుపాయాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# పారిశుద్ధ్యంలో జవాన్లదే కీలక పాత్ర

- ప్రతి వార్డుపై జవాన్లు పూర్తి పట్టు సాధించాలి
- నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తప్పవు
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న ఆదేశం



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** నగర పారిశుద్ధ్య నిర్వహణలో జవాన్లదే కీలక బాధ్యత అని, ప్రతి జవాన్ తనకు కేటాయించిన వార్డుపై పూర్తి పట్టు సాధించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న ఆదేశించారు. మంగళవారం లాల్‌బహదూర్ కళాశాల ఆడిటోరియంలో జవాన్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రతి జవాన్‌తో ప్రత్యేకంగా మాట్లాడి పారిశుద్ధ్య పరిస్థితులు, సిబ్బంది విధులు, చెత్త సేకరణపై ఆరా తీశారు. ప్రతిరోజూ ఉదయం 5 గంటలకే బయోమెట్రిక్ ద్వారా కార్మికుల హాజరు నమోదు చేయాలని, తడి, పొడి చెత్త వేర్పాటు, ఇంటింటి చెత్త సేకరణ, స్వచ్ఛ ఆటోల పనితీరుపై పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు. విలీన గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన చోట గ్యాంగ్‌మెన్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. రోడ్లు, చెత్త పాయింట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నెల రోజుల్లో పనితీరులో స్పష్టమైన మార్పు రావాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెరుగైన పనితీరు కనబరిచిన జవాన్లకు ప్రశంసాపత్రాలతో మెరిటోరియస్ సర్వీస్‌గా గుర్తింపు ఇస్తామని తెలిపారు. సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేశ్, సానిటరీ సూపర్‌వైజర్లు గోల్కొండ శ్రీను, నరేందర్, అనిల్, భాస్కర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు పాల్గొన్నారు.

# మా అంగన్‌వాడీ.. నా బాధ్యతపై అవగాహన



**కాకతీయ, చందుర్తి:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేటలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'పోషణ మాసం-మా అంగన్‌వాడీ.. నా బాధ్యత' కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీడీవో రాధా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించడం ఎంతో ముఖ్యమని డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ రేణుక అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొక్కుల నరేష్, ఉపసర్పంచ్ ఆకుల ఎల్లయ్య, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, ఏఎన్ఎం లావణ్య, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# మోడల్ మార్కెట్ లో మాట తప్పిన అక్రమార్కులు

- వినాయక చవితి తర్వాత తొలగిస్తామన్న హామీ బూటకమేనా?
- రోడ్లపై తడకల దందా యథాతథం..
- అధికారుల మౌనం!.. చైర్ పర్సన్ ఆదేశాలకు తూట్లు



**వరంగల్, కాకతీయ ప్రతినిధి :** లక్ష్మీపురం కూరగాయల మోడల్ మార్కెట్ లో అక్రమాల జాతర యథావిధిగా కొనసాగుతోంది. వినాయక చవితి పండగ వరకు గడువు ఇవ్వండి, ఆ తర్వాత మేమే స్వచ్ఛందంగా రోడ్లపై తడకలు తొలగించుకుంటామని అధికారులకు హామీ ఇచ్చిన అక్రమ వ్యాపారులు, పండగ అయిపోయినా మాట తప్పారు. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. కోట్ల రూపాయలతో 91 కమిషన్ షాపులు, 30 కమర్షియల్ షట్టర్లు, 158 మడిగలు, విశాలమైన పార్కింగ్ తో నిర్మించిన మోడల్ మార్కెట్ నేడు పూర్తిగా ఆక్రమణలకు నిలయంగా మారింది.

**రోడ్డే దుకాణం, రోడ్డే గోడౌన్**

మార్కెట్ లోపల పార్కింగ్ స్థలాన్ని ఓపెన్ ప్లాట్లుగా మార్చి అమ్ముకున్న వైనం పక్కనబెడితే, బయట పరిస్థితి మరీ దారుణం. రోడ్డుకు ఇరువైపులా ఇష్టానుసారంగా తడకలు, టెంట్లు వేసి రోడ్డునే దుకాణంగా మార్చేశారు. లారీలు, ఆటోలు రోడ్డుపైనే నిలిపి సరుకు దించుతుండడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ జామ్ నిత్యకృత్యమైంది. కూరగాయలకు వచ్చే మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ జామ్ లో సాక్షాత్తు మార్కెట్ చైర్ పర్సన్ యెర్ర ప్రియాంక అనిల్ వాహనమే ఇరుక్కోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేసి తక్షణమే తొలగించాలని ఆదేశించిన విషయం తెలిసిందే.

**ఫోన్ కాల్ తో ఆగిన తొలగింపు**

చైర్ పర్సన్ ఆదేశంతో అధికారులు తొలగింపునకు సిద్ధమవ్వగా, కొందరు స్థానిక నాయకుల ఫోన్ కాల్స్ తో ఆ కార్యక్రమం ఆగిపోయింది. దీంతో అక్రమార్కులు "వినాయక చవితి వరకు గడువు ఇవ్వండి, మేమే తొలగించుకుంటాం" అని అధికారులను వేడుకున్నారు. తీరా చవితి అయిపోయినా రోడ్లపై తడకలు అలాగే ఉన్నాయి. ఇది తప్పించుకోవడానికి ఆడిన డ్రామానేనా అనే అనుమానం వ్యక్తమవుతోంది.

**కిరాయి మేము కడితే, లాభం వాళ్లకా?**

ఇదే సమయంలో మరో దందా కూడా తెరపైకి వచ్చింది. మార్కెట్ లో లైసెన్స్ ఉన్న వ్యాపారులు కిరాయిలు కడుతుంటే, కొందరు అధికారులకు కావాల్సిన వారిని, తమ బంధువులను మార్కెట్ గేటు ముందే కూర్చోబెట్టి అక్రమంగా వ్యాపారం చేయిస్తున్నారని, లైసెన్స్ లేకుండానే రోడ్లపై వ్యాపారం సాగుతోందని పలువురు వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ బైలా ప్రకారం పాలన సాగితే తప్ప ఈ అక్రమాలకు అడ్డుకట్ట పడదని, చైర్ పర్సన్ స్వయంగా జోక్యం చేసుకుని రాజకీయ జోక్యం లేకుండా తొలగింపు చేపట్టాలని రైతులు, కొనుగోలుదారులు డిమాండ్ చేస్తున్నారు.

# పోలీస్ స్టేషన్ లోనే పెట్రోల్ దాడికి యత్నం

- హెడ్ కానిస్టేబుల్ పై హత్యాయత్నం
- నలుగురు అరెస్ట్..ఆటో సీజ్

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** ఏనుమాముల పోలీస్ స్టేషన్ ఆవరణలోనే పోలీసులపై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు యత్నించిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఏనుమాముల ఇన్ స్పెక్టర్ జవ్వాజి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం మధ్యాహ్నం 02:15 గంటల సమయంలో గతంలో కేసులో నిందితుడిగా ఉన్న గడ్డం సంపత్ బంధువులు, సహచరులైన 1) గడ్డం రాకేష్, 2) గడ్డం సువర్ణ (తల్లి), 3) గోగుల సునీల్, 4) ఎండి యాకుబ్ లు ఆటోలో స్టేషన్ కు వచ్చారు. విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ సక్రమ్ వద్దకు వెళ్లి సంపత్ పై కేసు ఎందుకు పెట్టారంటూ గొడవకు దిగారు. "మీ అందరిపైనా పెట్రోల్ పోసి చంపేస్తాం" అంటూ బెదిరించి బయటకు వెళ్లారు. ఆ తర్వాత తల్లి సువర్ణ పెట్రోల్ బాటిల్ అందించగా, రాకేష్ ఒంటిపై పోసుకున్నాడు. సునీల్ అగ్గిపెట్టె ఇవ్వగా, యాకుబ్ సహకరించాడు. పెట్రోల్ తోనే హెడ్ కానిస్టేబుల్ సక్రమ్ పైకి దూసుకొచ్చి నిప్పంటించే ప్రయత్నం చేశాడు. వెంటనే అప్రమత్తమైన సక్రమ్, ఇతర సిబ్బంది అగ్గిపెట్టె లాక్కుని నలుగురిని అదుపులోకి తీసుకుని పెను ప్రమాదాన్ని తప్పించారు. ప్రభుత్వ విధులకు ఆటంకం, హత్యాయత్నం, ఆత్మహత్యాయత్నం, అక్రమ ప్రవేశం సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. వారు వచ్చిన ఆటోను సీజ్ చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని పోలీస్ స్టేషన్ లోనే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారికైనా కఠిన చర్యలు తప్పవని ఇన్ స్పెక్టర్ సురేష్ హెచ్చరించారు.

# సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

- 550 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు
- హెలిప్యాడ్, కాన్వాయ్ మార్గాల్లో ప్రత్యేక నిఘా
- ట్రాఫిక్ మళ్లింపులు.. ప్రజలు సహకరించాలి
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**కాకతీయ, కరీంనగర్ :** నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవం, పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సెప్టెంబర్ 30న కరీంనగర్‌కు రానున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో పర్యటన ప్రశాంతంగా, సజావుగా జరిగేలా భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా రానున్న నేపథ్యంలో హెలిప్యాడ్, కాన్వాయ్ మార్గాలు, పాత కలెక్టరేట్, నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ పరిసరాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధి నుంచి సుమారు 550 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించినట్లు వెల్లడించారు. కార్యక్రమ ప్రాంగణాల్లో ప్రవేశ నియంత్రణ అమలు చేస్తూ అనుమతి ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతిస్తామన్నారు. అధికారిక పాస్‌లు ఉన్న మీడియా ప్రతినిధులకు ప్రత్యేక మీడియా గ్యాలరీలో ప్రవేశం ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రతిమ థియేటర్ నుంచి మమత థియేటర్ వరకు వాహనాల రాకపోకలను నియంత్రించి, అవసరమైన చోట్ల ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించనున్నట్లు కమిషనర్ తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రిజర్వు బలగాలు, ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచామన్నారు. ట్రాఫిక్ మళ్లింపులను గమనించి పోలీసులకు ప్రజలు, వాహనదారులు సహకరించాలని కోరారు.

# 307 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

- రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తింపు
- సీపీ గౌష్ ఆలం ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి



**కాకతీయ, కరీంనగర్ :** పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు కరీంనగర్ పారిశ్రామిక ప్రాంతంలోని హనుమాన్ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 307 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రైస్‌మిల్లు యజమాని టి. కరుణాకర్, తండ్రి జగన్నాథం, అశోక్‌నగర్, కరీంనగర్‌కు చెందినట్లు పోలీసులు తెలిపారు. సుమారు 307 క్వింటాళ్లు అంటే 30 టన్నుల 3 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కరీంనగర్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఘటనపై సంబంధిత చట్టాల ప్రకారం తదుపరి చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, తరలించడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# అక్రమ హార్డ్‌వేర్ పార్క్ నోటిఫికేషన్‌పై పోరాటం

- వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా
- 23 ఏళ్లుగా నష్టపోతున్న భూ బాధితులు
- 3,000 ఎకరాలను 22–ఏ జాబితా నుంచి తొలగించాలి
- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



**కాకతీయ, హైదరాబాద్ :** నాదర్‌గుల్, ఆదిబట్ల, ఎం.ఎం.కుంట ప్రాంతాల్లో హార్డ్‌వేర్ పార్క్ పేరుతో జరుగుతున్న భూసేకరణ నోటిఫికేషన్ వ్యవహారాన్ని తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో హార్డ్‌వేర్ పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ, తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సదస్సులో ఆయన మాట్లాడారు. 23 ఏళ్లుగా నష్టపోతున్న పేద, మధ్యతరగతి భూ బాధితులు, ప్లాట్ల యజమానులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాదర్‌గుల్, ఆదిబట్ల, ఎం.ఎం.కుంట పరిధిలోని సుమారు 3,000 ఎకరాలు, 20 వేల నివాస ప్లాట్లకు సంబంధించి టీజీఐఐసీ భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేసి బాధితులకు భూములపై చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని కోరారు. నష్టపరిహారం చెల్లించకుండానే భూములను 22-ఏ జాబితాలో చేర్చడం వల్ల పేదలు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వాటిని 22-ఏ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ హైకోర్టు కూడా భూసేకరణ ప్రక్రియపై స్పందించిన నేపథ్యంలో శాసనమండలిలో, ప్రభుత్వం వద్ద ఈ అంశాన్ని ప్రస్తావించి భూ బాధితులకు కాలపరిమితితో కూడిన శాశ్వత పరిష్కారం కోసం పోరాడతామని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ కోదండరామిరెడ్డి, ప్రజాసంఘాల నాయకులు, భూ బాధితులు, రైతులు, ప్లాట్ల యజమానులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు ఎడవల్లి హైస్కూల్ విద్యార్థులు



**కాకతీయ, ఏలూరు ప్రతినిధి :** మండలంలోని తూర్పు ఎడవల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కేపీడీటీ హైస్కూల్లో జరిగిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి థైక్వాండో సెలక్షన్స్‌లో వీరు విజయం సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14 బాలికల విభాగంలో 9వ వెయిట్ కేటగిరినందు పంతగాని ప్రియాంక, అండర్ 17 బాలికల విభాగంలో 4వ వెయిట్ కేటగిలో మానుకొండ వెంకట పావని, 5వ వెయిట్ కేటగిరిలో మరీదు సంధ్యారాణి, 6వ వెయిట్ కేటగిరిలో మానుకొండ భాగ్యశిరీష రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు వచ్చే నెల 12, 13, 14 తేదీల్లో అనంతపురం జిల్లా, తాడిపత్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జి. రవి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం కోటేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

# అంగన్వాడీ సేవలు గర్భిణీలు, బాలింతలు సద్వినియోగించుకోవాలి



**కాకతీయ, ఏలూరు ప్రతినిధి :** అంగన్వాడీల్లో అందించే సేవలు గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో బ్యూలా తెలిపారు. మండల కేంద్రంలోని కొండగూడెం 3 అంగన్వాడీ కేంద్రంలో జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు తీసుకునే ఆహారంతో పాటు జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. విజిలెన్స్ కమిటీ సభ్యులు కారే సాల్మాన్ రాజు అంగన్వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ మౌనిక, భారతి సూపర్వైజర్ ఎం విజయలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

# మేడారంలో 'ప్యారడైజ్' చిత్ర బృందం

- సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు
- నాని, సంపూర్ణేశ్‌బాబు, దర్శకుడు ఓదెల శ్రీకాంత్ సందర్శన



**కాకతీయ, ఏటూరునాగారం :** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క-సారలమ్మ గద్దెలను 'ప్యారడైజ్' సినిమా చిత్ర బృందం మంగళవారం సందర్శించింది. హీరో నాని, నటుడు సంపూర్ణేశ్‌బాబు, దర్శకుడు ఓదెల శ్రీకాంత్‌తో పాటు చిత్ర బృందం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. 'ప్యారడైజ్' సినిమాలో నాని తల్లి పాత్రకు సమ్మక్క అనే పేరు ఉండటం, సమ్మక్క పేరుతో రూపొందించిన పాటకు మంచి స్పందన లభించడంతో చిత్ర బృందం మేడారం సందర్శనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సందర్భంగా నాని తదితరులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. చిత్ర బృందం మేడారం వచ్చిన విషయం తెలుసుకున్న అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. నానిని చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపడంతో మేడారం సందడిగా మారింది.

# ఉపఎన్నిక వస్తే.. కోడలికి టికెట్ ఇవ్వండి!

**బీజేపీ అధిష్ఠానానికి ఈటల అభ్యర్థన?**

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** హుజూరాబాద్ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యమైతే తన కోడలు క్షమితారెడ్డికి బీజేపీ టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ అధిష్ఠానాన్ని మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కోరినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో హుజూరాబాద్‌లో బైపోల్ వస్తే ఎవరిని బరిలోకి దింపాలన్న చర్చ బీజేపీలోనూ మొదలైనట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఈటల కుటుంబం నుంచి క్షమితారెడ్డిని రాజకీయ రంగంలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం ఊపందుకుంది. హుజూరాబాద్ రాజకీయాలతో ఈటల కుటుంబానికి సుదీర్ఘ అనుబంధం ఉంది. ఈటల రాజేందర్ 2004 నుంచి హుజూరాబాద్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించారు. 2021 ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం ఆయన మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ప్రస్తుత ఉపఎన్నికలో అవకాశం దక్కకపోయినా.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి క్షమితారెడ్డిని రాజకీయాల్లోకి తీసుకురావాలన్న ఆలోచన ఉందని బీజేపీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

# నేడు సిరిసిల్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- కరీంనగర్ కలెక్టరేట్ భవన సముదాయం ప్రారంభం
- బహిరంగ సభలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి

**కాకతీయ, సిరిసిల్ల:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సిరిసిల్లలో పర్యటించనున్నారు. తొలుత కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ భవన సముదాయాన్ని మధ్యాహ్నం ప్రారంభించనున్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. సాయంత్రం సిరిసిల్లకు చేరుకోనున్న ముఖ్యమంత్రి అంబేద్కర్ చౌరస్తా నుంచి సభా ప్రాంగణం వరకు ర్యాలీగా వెళ్లనున్నారు. సభా ప్రాంగణం వద్ద వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగించనున్నారు.

# నాగ సుబ్రహ్మణ్యేశ్వరుడికి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి పూజలు



**కాకతీయ, గీసుగొండ :** ఊకల్ నాగ సుబ్రహ్మణ్యేశ్వరుడికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని ఊకల్ హవేలీ గ్రామంలో కొలువుదీరి ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శన చార్యులు స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి, వైదిక మంత్రోచ్ఛరణల నడుమ విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నిర్మల గీతాంబ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారి విశేషతను న్యాయమూర్తికి వివరించారు.అదేవిధంగా గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తిమ్మాపురం రాజేశ్వరరావు, కోశాధికారి కొత్తగట్టు రాజేందర్, గ్రామ సర్పంచ్ కక్కర్ల సుభాష్, పంచాయతీ కార్యదర్శి రజిత, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దళితుల హక్కుల సాధనకు అండగా ఆర్‌పీఐ

- ఆర్‌పీఐ భివాండి జిల్లా అధ్యక్షుడు మహేంద్ర గైక్వాడ్ పిలుపు



**కాకతీయ, రుద్రంగి:** రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా భివాండి జిల్లా అధ్యక్షుడు మహేంద్ర గైక్వాడ్, సినీ నిర్మాత మార్గం గోపి మహారాష్ట్ర నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలానికి వచ్చిన సందర్భంగా స్థానిక దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేంద్ర గైక్వాడ్ మాట్లాడుతూ దళితుల హక్కుల సాధన, అభ్యున్నతికి ఆర్‌పీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమాజంలో వెనుకబడిన వర్గాల హక్కుల కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తనను ఆదరించి సన్మానించిన రుద్రంగి మండల దళిత సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు దయ్యాల నారాయణ, గసికంటి రాజు, కట్కూరి దాసు, తర్రె లింగం, సింగారపు గంగరాజం, దయ్యాల పెద్దులు, సుంచు అనిల్‌కుమార్, సింగారపు గంగిరెడ్డి, లింగంపెల్లి సుదర్శన్, గొళ్ళెం నర్సింగ్, కుమార్, స్థానిక యువకులు పాల్గొన్నారు.

## సీఎం బహిరంగ సభను విజయవంతం చేయండి

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి పిలుపు**



**కాకతీయ, రుద్రంగి:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు సంబంధించిన ఏర్పాట్లు, గ్రామాల వారీగా ప్రజలు, కార్యకర్తలను పెద్ద సంఖ్యలో తరలించడం, పార్టీ శ్రేణుల సమన్వయంపై విస్తృతంగా చర్చించామని తెలిపారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగి సభను జయప్రదం చేయాలని కోరారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు భారీగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గండి నారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రం గంగానర్సయ్య, నాయకులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గట్ల మీనయ్య, అక్కెనపెల్లి శ్రీనివాస్, దయ్యాల శ్రీనివాస్, తర్రె మనోహర్, సనుగుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## తండ్రిని కర్రతో కొట్టి చంపిన తనయుడు

- మద్యం మత్తులో తల్లిని కొడుతున్నాడని ఘాతుకం
- కర్రతో దాడి చేయడంతో లక్కుమల్ల వెంకన్న మృతి



**కాకతీయ, కురవి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి గ్రామంలో తండ్రిని కొడుకు కర్రతో కొట్టి హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లక్కుమల్ల వెంకన్న (56) మద్యం మత్తులో తరచూ తన తల్లిని కొడుతున్నాడని, దీంతో ఆయన కుమారుడు సునీల్ కర్రతో దాడి చేసినట్లు సమాచారం. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వెంకన్న మృతి చెందాడు. ఘటనపై కురవి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కేటీఆర్‌ను కలిసిన పెద్ది స్వప్న

- నర్సంపేట నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చ



**కాకతీయ, నర్సంపేట టౌన్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సుదర్శన్‌రెడ్డి మృతిచెందిన అనంతరం తొలిసారిగా కేటీఆర్‌ను కలిసిన ఆమె కుటుంబ పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కుటుంబ యోగక్షేమాలు, పిల్లల చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సంపేట నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చ జరిగినట్లు సమాచారం. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితులపై సమీక్ష నిర్వహిస్తానని కేటీఆర్ స్వప్నకు తెలిపినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## ఫార్మర్ రిజిస్ట్రీలో ప్రతి రైతు నమోదు కావాలి : ఏఈఓ సంపత్



**కాకతీయ,జమ్మికుంట:** వ్యవసాయ పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఈఓ సంపత్ సూచించారు. మంగళవారం జమ్మికుంట మండలం వావిలాల రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ సంపత్ మాట్లాడుతూ.. 2026 జనవరి 1 నుంచి ఆగస్టు 13 వరకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పొందినప్పటికీ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు కాని రైతులు వెంటనే నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎఫ్ఎఫ్ఎస్ ద్వారా యూరియా బుకింగ్, ప్రభుత్వ మద్దతు ధరకు పంటల విక్రయం, బ్యాంకు రుణాలు, పీఎం కిసాన్ పథకం ప్రయోజనాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ సంక్షేమ పథకాలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు అవసరమని పేర్కొన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వావిలాల, నగరం, నాగారం, పాపక్కపల్లి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# తప్పుడు ప్రచారం చేస్తే మహిళలే కొడతరు

- వరంగల్ అభివృద్ధి పనులను త్వరలో పూర్తి చేస్తాం
- వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ వ్యాఖ్యలు
- 111 మందికి రూ.61.61 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ
వరంగల్ అభివృద్ధి పనులను త్వరలో పూర్తి చేస్తాం



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** తన కుటుంబంపై తప్పుడు ప్రచారాలు చేస్తే తన దగ్గర ఉన్న మహిళలే ఉరికిచ్చి కొడతారని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ అన్నారు. వరంగల్ తూర్పు క్యాంపు కార్యాలయంలో మంగళవారం 111 మంది లబ్ధిదారులకు రూ.61,61,200 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల వచ్చిన నాయకులు గాల్లో కత్తులు తిప్పుతున్నారని వ్యాఖ్యానించారు. ఎంజీఎంలో బీఆర్ఎస్ నేతలు కావాలనే తొక్కిసలాట చేసి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి పదవి పోయినా బాధ లేదని, అధికారులతో సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. త్వరలోనే 8 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, నూతన కలెక్టరేట్ ప్రారంభిస్తామని, కాంట్రాక్టర్ డబ్బుల కోసం పనుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. వరంగల్ దేవాలయాల అభివృద్ధికి బీజేపీ నేతలు కేంద్రం నుంచి నిధులు తేవాలని, ఫోర్ట్‌లో బయటపడిన 11 దేవాలయాలను కేంద్ర సహకారంతో అభివృద్ధి చేయాలని అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని 99 శాతం దేవాలయాలకు తమే నిధులు ఇచ్చామని చెప్పారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 24 కార్పొరేటర్ స్థానాలు గెలవడమే లక్ష్యమన్నారు. వారంలో ఒకరోజు 'డివిజన్ బాట' నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సర్వే జరుగుతోందని, అర్హులైన పేదలు, జర్నలిస్టులకు ఇళ్లు కేటాయిస్తామని వెల్లడించారు.

## గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- గుండె నొప్పిని నిర్లక్ష్యం చేయొద్దు.. వైద్యులను సంప్రదించాలి
- ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం. అప్పయ్య




**కాకతీయ, హనుమకొండ:** గుండె సంబంధిత వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. అప్పయ్య సూచించారు. గుండె నొప్పి వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మంగళవారం హనుమకొండలోని అశోక కాన్ఫరెన్స్ హాల్లో ఏకశిలా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎంహెచ్‌వో జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడంతో పాటు శారీరక వ్యాయామాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని అప్పయ్య సూచించారు. గుండె సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. హాస్పిటల్ ఎండీ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ నడక, వ్యాయామం, యోగా వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. నెల రోజులపాటు ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గుండె నొప్పిని నిర్లక్ష్యం చేయరాదని డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, డాక్టర్ ఆసిఫ్ ఇక్బాల్, డాక్టర్ రామకృష్ణ రెడ్డి, డాక్టర్ అనిల్ బన్నా, డాక్టర్ చేతన్ కృష్ణ, డాక్టర్ లావణ్య, డాక్టర్ సబీహా నిగార్ సూచించారు. 560 మందికి పైగా ప్రజలకు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ జనరల్ మేనేజర్ శ్రీదేవితో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం

**శంకరపట్నంలో సీఎం దిష్టిబొమ్మ దహనం**



**కాకతీయ,శంకరపట్నం:** ఢిల్లీలో నిర్వహించిన 'ది కాంక్లేవ్ 2026' కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం శంకరపట్నం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. రేవంత్‌రెడ్డి "శివుడు పేదల దేవుడు.. రాముడు ధనికుల దేవుడు" అంటూ వ్యాఖ్యానించినట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు హిందూ దేవుళ్లను విభజించేలా ఉన్నాయని విమర్శించారు. దేవుళ్లలో పేద, ధనిక అనే తేడాలు ఉండవని, రాజకీయ ప్రయోజనాల కోసం శ్రీరాముడు, శివుడి మధ్య విభజన సృష్టించేలా మాట్లాడటం సరికాదన్నారు. రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హిందూ దేవుళ్లను రాజకీయాలకు దూరంగా ఉంచాలని, మత విశ్వాసాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం తగదని ఆయన పేర్కొన్నారు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా చేపట్టిన ఈ ఆందోళనలో బీజేపీ నాయకులు దొంగల రాములు, కొయ్యడ అశోక్, నిమ్మశెట్టి సంపత్, రాసమల్ల శ్రీనివాస్, బిజిలి సారయ్య, కనకం కుమార్, కూనారపు శ్రీనాథ్, కాంతాల రాజిరెడ్డి, వడ్లకొండ రాజేందర్, గూళ్ల రాజు, గొల్లిపెల్లి వెంకటేష్, భూపతి రవి, బొజ్జ కుమార్, మడ్డి సాయితేజ, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ తూర్పులో అభివృద్ధి శూన్యం

- బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు
- ఎమ్మెల్యే కనబడటం లేదంటూ బీజేపీ వినూత్న నిరసన
- బూడిద గుమ్మడికాయలు కొట్టి కలెక్టరేట్‌ను ప్రారంభించిన బీజేపీ నేతలు




**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యంగా ఉందని బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు విమర్శించారు. ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ కనబడటం లేదంటూ సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. ఓసిటీలోని ప్రదీప్‌రావు నివాసం నుంచి నూతన వరంగల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అక్కడ బూడిద గుమ్మడికాయలు కొట్టారు. అనంతరం బీజేపీ శ్రేణులే కలెక్టరేట్‌ను అధికారికంగా ప్రారంభించినట్లు ప్రకటించారు. వరంగల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ వద్ద కాకతీయుల కీర్తి తోరణం ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని ప్రదీప్‌రావు అన్నారు. ఇది చరిత్రను, కాకతీయుల కీర్తిని అవమానించడమేనని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా ఏర్పాటైనా ప్రభుత్వ కార్యాలయాలు హనుమకొండలోనే కొనసాగుతున్నాయని, చివరకు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ నివాసం కూడా హనుమకొండలోనే ఉందని అన్నారు. తూర్పు నియోజకవర్గంలో చిన్నపాటి వర్షానికే ముంపు సమస్య ఏర్పడుతోందని, ఎంజీఎం ఆసుపత్రి శిథిలావస్థకు చేరినా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని విమర్శించారు. వరంగల్ కలెక్టరేట్, నూతన ఆసుపత్రిని వెంటనే ప్రారంభించి, పెండింగ్‌లో ఉన్న బస్‌స్టాండ్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంటా రవి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజల ఆరోగ్యం కోసమే హెల్త్ క్యాంప్

- చిన్ననాగారం సర్పంచ్ చెడుపాక సుజాత యాకయ్య
- 177 మందికి వైద్య పరీక్షలు.. ఉచిత మందుల పంపిణీ

**కాకతీయ, ఇనుగుర్తి:** గ్రామ ప్రజల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయించినట్లు సర్పంచ్ చెడుపాక సుజాత యాకయ్య తెలిపారు. మంగళవారం ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలో సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్, సాయిరాం హాస్పిటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం, మందుల పంపిణీ నిర్వహించారు. సర్పంచ్ చెడుపాక సుజాత యాకయ్య, ఎంపీడీవో పార్థసారధి, వార్డు సభ్యులు శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామంలోని పేదలు వివిధ రుగ్మతలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఖమ్మం నుంచి వైద్య నిపుణులు వచ్చి సేవలందించడం అభినందనీయమని సర్పంచ్ తెలిపారు. సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్, సాయిరాం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఎంపీడీవో పార్థసారధి అన్నారు. సుమారు 25 మంది వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు సేవలందించారని తెలిపారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న 177 మందికి వైద్య సేవలు అందించి, పరీక్షల అనంతరం ఉచిత మందులు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ డైరెక్టర్ గెద్దం సామ్యూల్ తెలిపారు. డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ పవన్, వైద్య సిబ్బంది సేవలందించారు. మాజీ సర్పంచ్ బైరు చిన్న బాలయ్య, వార్డు సభ్యులు నిడిగంటి చంద్రమౌళి, మునిగంటి సరిత రాజు, చెడుపాక అలివేలు వెంకన్న, బైరు నాగన్న, కొయ్యడి యాదగిరి, బత్తిని రాములు గౌడ్, పెదగోని వెంకటయ్య, బైరు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎనగల్ సమస్యలు పరిష్కరించకుంటే.. నిరాహార దీక్ష!

- వాగుపై వంతెనకు నిధులు మంజూరు చేయాలి
- ఎన్నికల హామీలను అమలు చేసి గ్రామాన్ని అభివృద్ధి చేయాలి
- బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్



**కాకతీయ, చందుర్తి :** ఎనగల్ గ్రామ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, ఎన్నికల హామీలను అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం ఎనగల్‌లో ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ముఖ్యంగా వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను డిమాండ్ చేశారు. ఎనగల్‌లోని ఎల్లమ్మ, బీరప్ప, చిన్నన్న-పెద్దన్న ఆలయాలు, డంపింగ్ యార్డు, వ్యవసాయ పొలాలకు వెళ్లే మార్గంలోని వాగుపై వంతెన లేక ప్రజలు, రైతులు, గౌడ కులస్తులు, పశువుల కాపర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలంలో వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయని, గతంలో పశువులు కొట్టుకుపోయిన ఘటనలు కూడా జరిగాయని అన్నారు. ఎనగల్ నుంచి మామిడిపల్లి, మూడపల్లి, జోగాపూర్ వెళ్లే రహదారులను కూడా అభివృద్ధి చేయాలని కోరారు. గ్రామ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే అక్టోబర్ 5న అంబేద్కర్ విగ్రహం సాక్షిగా నిరాహార దీక్ష చేపడతామని మొకిలే విజేందర్ హెచ్చరించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు అల్లాడి రమేష్, గౌడ సంఘం అధ్యక్షుడు గడ్డం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ కార్డుల జారీలో అవకతవకలపై ఫిర్యాదు

- హన్మకొండ మాజీ డీపీఆర్‌ఓ అయూబ్‌ఖాన్‌పై విచారణకు కలెక్టర్ ఆదేశం
- విచారణ అధికారిగా డీఆర్వో శ్రీనివాస్ నియామకం



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** హనుమకొండ పూర్వ డీపీఆర్ఓ, ప్రస్తుతం వరంగల్ నగరపాలక సంస్థ పీఆర్ఓగా పనిచేస్తున్న అయూబ్‌ఖాన్‌పై విచారణకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. విచారణ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌ను నియమించారు. హనుమకొండ జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో చాహత్ బాజ్‌పాయ్ కలెక్టర్‌గా, కె. శ్రీనివాస్ జిల్లా రెవెన్యూ అధికారిగా ప్రస్తుతం నమోదై ఉన్నారు. 2026-28 సంవత్సరానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మంగళవారం కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. 10 మందితో కూడిన కమిటీ రెండుసార్లు సమావేశమై జర్నలిస్టుల దరఖాస్తులను పరిశీలించి అర్హులు, పెండింగ్ దరఖాస్తులపై నిర్ణయం తీసుకున్నప్పటికీ కమిటీ సిఫార్సులను పక్కనపెట్టి కార్డులు మంజూరు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజకీయ నాయకుల వద్ద పనిచేసేవారికి, రియల్టర్లకు, జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు కార్డులు జారీ చేశారని ఆరోపించారు. కమిటీ సమావేశాల్లోని జాబితాలను సభ్యులకు అందించలేదని తెలిపారు. ఫిర్యాదును స్వీకరించిన కలెక్టర్ విచారణకు ఆదేశించగా, అనర్హులను తొలగించి వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం చేయాలని సభ్యులు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గాడిపల్లి మధు, బీఆర్ లెనిన్, గడ్డం కేశవమూర్తి, మస్కపురి సుధాకర్, కంకణాల సంతోష్, బొల్ల అమర్, గోకారపు శ్యాం, వల్లాల జగన్, ఎన్. బుచ్చిరెడ్డి, నయీమ్ ఉన్నారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at
H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266